మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 253 | శనివారం | 28 - 03 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## నర్సుల వలసలను అడ్డుకోవాలి: శబరి



3లో..



## సహజీవనంపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

- వ్యక్తిగత హక్కులకే ప్రాధాన్యం
- వివాహితుడితో సహజీవనం నేరం కాదన్న స్పష్టం
- జంటకు రక్షణ కల్పించాలని పోలీసులకు ఆదేశాలు
- నైతికత, చట్టం వేర్వేరని కోర్టు అభిప్రాయం

మన గళం, అలహాబాద్ : సహజీవనం అంశంపై అలహాబాద్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వివాహితుడైన వ్యక్తి, వయోజనురాలైన మహిళ పరస్పర అంగీకారంతో కలిసి జీవించడం చట్టపరంగా నేరం కాదని స్పష్టం చేసింది. వ్యక్తిగత హక్కులను పరిరక్షించడం కోర్టు బాధ్యతగా పేర్కొంటూ, సామాజిక నైతికత చట్టంపై ఆధిపత్యం చెలాయించలేదని అభిప్రాయపడింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ జంట తమకు రక్షణ 2 లో..

## హోర్ముజ్ నుంచి భారత్‌కు ఎల్పీజీ సరఫరా




- 'జగ్ వసంత్' చేరికతో ఊరట
- 47,600 మెట్రిక్ టన్నుల ఎల్పీజీతో గుజరాత్ పోర్టుకు చేరిక

మన గళం, అహ్మదాబాద్ : దేశంలో గ్యాస్ సంక్షోభం నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ యుద్ధ పరిస్థితుల కారణంగా హోర్ముజ్ జలసంధి వద్ద చిక్కుకుపోయిన ఎల్పీజీ నౌక 'జగ్ వసంత్' భారత్‌కు చేరుకోవడంతో గ్యాస్ సరఫరాకు ఊరట లభించింది. 23 రోజుల పాటు నిలిచిపోయిన ఈ నౌక, ఇరాన్‌తో జరిగిన దౌత్య చర్చల అనంతరం జలసంధిని దాటి గుజరాత్‌లోని పోర్టుకు చేరుకుంది. సుమారు 47,600 మెట్రిక్ టన్నుల ఎల్పీజీతో వచ్చిన ఈ ట్యాంకర్ దేశీయ అవసరాలకు కీలకంగా మారనుంది. ప్రస్తుత గ్యాస్ కొరత 2 లో..

## వాణిజ్య ఎల్‌పీజీ కేటాయింపుల పెంపు

- పరిశ్రమలకు ఊతం, పారదర్శకతకు కేంద్రం కట్టుబాటు
- మొత్తం కోటా 70 శాతానికి పెంపు.. పరిశ్రమలకు ఊపిరి పీల్చే అవకాశం
- అక్రమ రీఫిల్లింగ్ అరికట్టడమే ప్రధాన లక్ష్యం



మన గళం, న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా వాణిజ్య అవసరాల కోసం ఎల్‌పీజీ సరఫరా, కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్యాస్ వినియోగంలో పారదర్శకత పెంచడం, అక్రమ వినియోగాన్ని అరికట్టడం, పరిశ్రమలకు అవసరమైన ఇంధనాన్ని సమృద్ధిగా అందించడం లక్ష్యంగా అన్ని 2 లో..





# పెరుగుతున్న మరణ మృదంగం

- ప్రమాదకర రహదారులు
- రోడ్డు భద్రతపై ప్రశ్నలు
- అధికారుల నిర్లక్ష్యంపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- రహదారి ఇంజనీరింగ్ లోపాలతోనే 60 శాతం ప్రమాదాలు

మన గళం డెస్క్ : దేశవ్యాప్తంగా రహదారులు రక్తాసిక్తమవుతున్నాయి. అత్యాధునిక ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్నా, వాటిపై ప్రయాణం మాత్రం ప్రాణాపాయంగా మారుతోంది. తాజా నివేదికల ప్రకారం, గడిచిన ఏడాదిలో దేశంలో సుమారు 4.80 లక్షల రోడ్డు ప్రమాదాలు సంభవించగా, అందులో 1.77 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. అంటే ప్రతిరోజూ సగటున 485 మంది మరణిస్తున్నారనే చేదు నిజం వెల్లడవుతోంది. తాజాగా మార్చి 26న ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం వద్ద జరిగిన ప్రైవేటు బస్సు ప్రమాదంలో 14 మంది సజీవ దహనం కావడం రహదారి భద్రతపై ఉన్న డొల్లతనాన్ని మరోసారి బయటపెట్టింది. రహదారి ప్రమాదాలకు కేవలం అతివేగం లేదా డ్రైవర్ల అజాగ్రత్త మాత్రమే కారణం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జాతీయ స్థాయిలో జరిగిన తాజా అధ్యయనం ప్రకారం, 2 లో..

## ఇంధన సుంకాల కోతకు సీఎం చంద్రబాబు స్వాగతం

- ప్రజా సంక్షేమానికి కేంద్రం కీలక నిర్ణయం
- మోదీ నాయకత్వాన్ని ప్రశంసించిన సీఎం
- ఇంధన ధరల భారాన్ని తగ్గించే చర్యగా అభివర్ణన



అమరావతి, మార్చి 27 ,మన గళం: పెట్రోల్, 2 లో..

## ఆకివీడు ఘటనపై ఉప ముఖ్యమంత్రి ఆగ్రహం

- శ్రీరామనవమి రోజున దాడి తీవ్రంగా ఖండన
- కుట్ర కోణంపై అనుమానం వ్యక్తం
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్న ఆదేశం



2 లో..

# నేడు...ఓ సుదినం

▶▶ శ్రీరామ చంద్రుని బాటలో అందరూ నడవాలి ▶▶ జిల్లా జడ్జి కపర్ది





(మన గళం,కర్నూలు నరసింహారెడ్డి నగర్) : శ్రీరామ నవమి ఎంతో సుదినమని, ఆ పర్వదినాన్ని అందరూ భక్తి,శ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా జడ్జి కపర్ది అన్నారు. శుక్రవారం నగరంలోని స్థానిక పాతబస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ షిరిడి సాయి దేవస్థానంలో జరిగిన బాంకెట్ హాల్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శప్రాయుడైన శ్రీరామ చంద్రుడిని అందరూ ఆదర్శంగా తీసుకుని, జీవితాన ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అంతకు ముందు జిల్లా న్యాయమూర్తి కపర్ధికి ప్రముఖ న్యాయవాదులు నాగలక్ష్మి దేవి,ఏ.పి.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర,వాసు,శ్రీనివాసులు తదితరులు పుష్పగుచ్ఛాలను అందజేసి, శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు,

# హోర్ముజ్ నుంచి భారత్‌కు ఎల్పీజీ సరఫరా




పరిస్థితుల్లో ఈ సరఫరా వినియోగదారులకు ఉపశమనం కలిగించే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వాణిజ్య, గృహ వినియోగ రంగాలకు ఇది తోడ్పడనుంది. ఇదిలా ఉండగా, 45,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీని రవాణా చేస్తున్న 'పైన్ గ్యాస్' అనే మరో ట్యాంకర్ త్వరలో న్యూ మంగళూరు పోర్టుకు చేరుకోనుంది. ఈ రెండు ట్యాంకర్ల ద్వారా మొత్తం 92,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ దేశానికి అందుబాటులోకి రానుంది. ఇది దేశంలో ఒక రోజు వంటగ్యాస్ వినియోగానికి సమానమని అధికారులు తెలిపారు.

ఇటీవల పది రోజుల్లో హోర్ముజ్ జలసంధిని దాటి మరో రెండు పెద్ద ఎల్పీజీ ట్యాంకర్లు కూడా భారత్ చేరుకున్నాయి. మధ్యప్రాచ్య ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఈ సరఫరాలు పునరుద్ధరించడం గమనార్హం. అయినప్పటికీ సముద్ర మార్గాల్లో ఇంకా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి వద్ద సుమారు 20 భారత నౌకలు చిక్కుకున్నట్లు షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వీటిలో ఐదు భారీ ఎల్పీజీ ట్యాంకర్లు ఉన్నాయని పేర్కొంది. ఇవి భారత్‌కు చేరుకుంటే అదనంగా 2,30,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇంకా ఒక భారీ ఎల్పీజీ ట్యాంకర్ త్వరలో లోడింగ్ పూర్తి చేసి భారత్‌కు బయలుదేరనుందని అధికారులు తెలిపారు. మొత్తం మీద ఈ సరఫరాలు వేగవంతమైతే దేశంలో గ్యాస్ కొరత సమస్య తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్రం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటోంది.

# ఇంధన సుంకాల కోతకు సీఎం చంద్రబాబు స్వాగతం

డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వాగతించారు. ఇది ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న బలమైన నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ట్వీట్‌ను సోషల్ మీడియా ద్వారా పంచుకున్న చంద్రబాబు, క్లిష్ట సమయాల్లోనే నాయకత్వ పటిమ బయటపడుతుందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సవాళ్లు ఉన్నప్పటికీ దేశం స్థిరంగా ముందుకు సాగుతుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ఆయన ప్రశంసించారు. దేశ ప్రజల ప్రయోజనాలను ముందుంచుకుని కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ప్రజలకు ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు.

అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలపై పడే భారాన్ని తగ్గించేందుకు ఈ చర్య ఎంతగానో సహాయపడుతుందని సీఎం పేర్కొన్నారు. ఇది ప్రజా కేంద్రకమైన నిర్ణయమని అభివర్ణించారు. ఇతర దేశాలు తమ పౌరులపై ఇంధన ధరల భారాన్ని మోపుతున్న సమయంలో భారత్ మాత్రం ప్రజల ప్రయోజనాలను కాపాడే విధంగా ముందడుగు వేస్తోందని చంద్రబాబు అన్నారు. ప్రజల సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మొత్తంగా ఈ నిర్ణయం ప్రజలకు ఉపశమనం కలిగిస్తూ ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. కేంద్ర నిర్ణయాన్ని రాష్ట్రం తరఫున హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.

# సహజీవనంపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

కల్పించాలని హైకోర్టును ఆశ్రయించింది. మహిళ కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని బెదిరింపులు ఎదుర్కొంటున్నామని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన డివిజన్ బెంచ్, ఇద్దరు వయోజనులు స్వేచ్ఛగా కలిసి జీవించడాన్ని ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేసింది. జస్టిస్ జె.జె. మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనాలతో కూడిన బెంచ్, "నైతికత, చట్టం వేర్వేరు" అని వ్యాఖ్యానించింది. చట్టపరంగా నేరం జరగనప్పుడు కోర్టు చర్యలకు సామాజిక అభిప్రాయాలు మార్గదర్శకం కావని పేర్కొంది. పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తూ, ఆ జంటకు తక్షణ రక్షణ కల్పించాలని ఆదేశించింది.

అలాగే షాజహాన్‌పూర్ పోలీసు సూపరింటెండెంట్ ఈ విషయంలో చర్యలు తీసుకోకపోవడాన్ని కోర్టు తీవ్రంగా విమర్శించింది. ఆ జంటపై నమోదైన కిడ్నాప్ కేసులో వ్యక్తిని అరెస్ట్ చేయరాదని స్పష్టం చేసింది. వారి భద్రతను పోలీసులు నిర్ధారించాలని ఆదేశించింది. మహిళ కుటుంబ సభ్యులు జంటను బెదిరించకూడదని, వారి నివాసంలోకి ప్రవేశించరాదని, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంప్రదించరాదని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించాల్సిన అవసరం ఉందని మరోసారి గుర్తుచేసింది. ఇక మరో కేసులో మధ్యప్రదేశ్ హైకోర్టు గ్వాలియర్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యాభర్తల మధ్య జరిగే అసహజ లైంగిక చర్యలను భారత శిక్షాస్మృతి సెక్షన్ 377 కింద నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆ కేసులో నమోదు చేసిన సెక్షన్ 377 ఆరోపణలను కొట్టివేయాలని ఆదేశించింది. అయితే వరకట్న వేధింపులు, శారీరక హింసకు సంబంధించిన ఇతర ఆరోపణలపై విచారణ కొనసాగుతుందని కోర్టు పేర్కొంది. మొత్తం మీద వ్యక్తిగత హక్కులు, చట్టపరమైన పరిమితులపై ఈ తీర్పులు కొత్త చర్చకు దారితీసే అవకాశముందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# వాణిజ్య ఎల్పీజీ కేటాయింపుల పెంపు

రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు అధికారిక లేఖ రాసింది. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ తీసుకున్న ఈ నిర్ణయం పారిశ్రామిక రంగానికి ఊతమివ్వడమే కాకుండా గ్యాస్ పంపిణీ వ్యవస్థను క్రమబద్ధీకరించే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు. తాజా ఉత్తర్వుల ప్రకారం వాణిజ్య ఎల్పీజీ కేటాయింపులను గణనీయంగా పెంచుతూ మొత్తం కోటాను 70 శాతానికి తీసుకువచ్చారు. ఇంతకుముందు అమల్లో ఉన్న 50 శాతం కేటాయింపులకు అదనంగా మరో 20 శాతం పెంపు చేపట్టడం ద్వారా పరిశ్రమల అవసరాలను తీర్చేందుకు కేంద్రం ముందడుగు వేసింది. ఈ నిర్ణయం వల్ల గ్యాస్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అనేక పరిశ్రమలకు ఉపశమనం లభించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ఈ అదనపు కేటాయింపుల్లో స్టీల్, ఆటోమొబైల్, టెక్స్‌టైల్, డై, కెమికల్స్, ప్లాస్టిక్ వంటి కీలక రంగాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ముఖ్యంగా కార్మిక శక్తి అధికంగా ఉన్న పరిశ్రమలు, దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఉత్పత్తి రంగాలు ఈ నిర్ణయం ద్వారా లాభపడనున్నాయి. ఉత్పత్తి వ్యయాలు తగ్గడం, తయారీ సామర్థ్యం పెరగడం, ఉపాధి అవకాశాలు మెరుగుపడటం వంటి అనేక ప్రయోజనాలు కలగనున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సహజ వాయువుతో భర్తీ చేయలేని ప్రత్యేక హీటింగ్ అవసరాలు ఉన్న పరిశ్రమలకు కూడా ఈ కేటాయింపుల్లో అధిక ప్రాధాన్యత కల్పించారు. ప్రాసెస్ ఆధారిత పరిశ్రమలు, ప్రత్యేక సాంకేతిక అవసరాలున్న యూనిట్లు ఈ నిర్ణయం వల్ల ప్రయోజనం పొందనున్నాయి. అంతేకాకుండా ఇలాంటి పరిశ్రమలకు కొన్ని రిజిస్ట్రేషన్ నిబంధనల నుంచి మినహాయింపులు ఇవ్వడం ద్వారా పరిపాలనా ప్రక్రియలను సులభతరం చేశారు.

పెట్రోలియం శాఖ కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్ మాట్లాడుతూ, ఈ నిర్ణయం వల్ల రాష్ట్రాల్లో పారిశ్రామిక కార్యకలాపాలు మరింత చురుకుగా మారతాయని తెలిపారు. సంస్కరణల ఆధారంగా అందుబాటులో ఉన్న అదనపు 10 శాతం కోటాను కూడా రాష్ట్రాలు తక్షణమే వినియోగించుకోవాలని ఆయన సూచించారు. దీంతో పరిశ్రమలు నిరంతర సరఫరాతో ఉత్పత్తి కార్యకలాపాలను అంతరాయం లేకుండా కొనసాగించగలవని చెప్పారు. ఇక గ్యాస్ సిలిండర్ల దుర్వినియోగాన్ని అరికట్టడంపైనా కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ కొత్త నిబంధనల అమలు ద్వారా అక్రమ రీఫిల్లింగ్ వంటి కార్యకలాపాలను నియంత్రించవచ్చని భావిస్తున్నారు. గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేకుండా చేయడం, సరఫరాలో పారదర్శకతను పెంచడం, సరైన లబ్ధిదారులకు గ్యాస్ అందేలా చూడడం కూడా ఈ చర్యల ముఖ్య ఉద్దేశ్యంగా పేర్కొన్నారు.

మొత్తంగా ఈ నిర్ణయం పరిశ్రమలకు ఊపిరి పోసే చర్యగా, గ్యాస్ సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చే దిశగా కీలకంగా మారనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పారిశ్రామిక అభివృద్ధి, వినియోగ నియంత్రణ, పారదర్శకత అనే మూడు లక్ష్యాలను ఒకేసారి సాధించడానికి కేంద్రం తీసుకున్న ఈ చర్య ప్రభావవంతంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# పెరుగుతున్న మరణ మృదంగం

సుమారు 59 శాతం మరణాలు వాహన చోదకుల తప్పిదం లేకుండానే జరుగుతున్నాయి. రహదారి నిర్మాణంలో ఉన్న లోపాలు, సరైన మలుపులు లేకపోవడం, 'బ్లాక్ స్పాట్స్' గుర్తించడంలో వైఫల్యం వంటి అంశాలు మృత్యువుకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం దాదాపు 350 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో వాటి సవరణ ప్రక్రియ నత్తనడకన సాగుతుండటం గమనార్హం.

అధికారుల పర్యవేక్షణ లోపం కూడా ఈ ప్రమాదాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు వాహనాలు, అనుమతి లేని భారీ వాహనాల రాకపోకలను అరికట్టడంలో రవాణా శాఖ విఫలమవుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో మరియు మధ్యాహ్నం వేళల్లో హైవేలపై పెట్రోలింగ్ వ్యవస్థ నామమాత్రంగానే ఉంటోంది. పార్లమెంటరీ కమిటీ తాజాగా 'నేషనల్ హైవే సేఫ్టీ పెట్రోల్' అనే ప్రత్యేక విభాగం అవసరమని సిఫార్సు చేసిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 'గోల్డెన్ అవర్' అని పిలిచే తొలి అర గంటలో బాధితులకు వైద్యం అందకపోవడం వల్ల మరణాల సంఖ్య మరింత పెరుగుతోంది. రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గారు ఇటీవల సడక్ సురక్ష అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతూ, రహదారి భద్రత కోసం 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించారు. కొత్తగా రాబోతున్న 'రోడ్డు సేఫ్టీ బిల్లు 2026' ద్వారా కఠినమైన నిబంధనలు అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వాహనాల్లో ఆరు ఎయిర్‌బ్యాగులు తప్పనిసరి చేయడం, లైసెన్సుల జారీలో పారదర్శకత పెంచడం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ లోపాలను సరిదిద్దకుండా కేవలం జరిమానాలు పెంచడం వల్ల ప్రయోజనం ఉండదని సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోని జాతీయ రహదారులు 44 మరియు 65 లపై ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంది. హైదరాబాద్ శివార్లలోని రహదారులు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి, ప్రమాదకరమైన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, రహదారులపై వెలుతురును పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల భాగస్వామ్యం కూడా ఇందులో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీటు బెల్టు ధరించడం ద్వారా ప్రాణ నష్టాన్ని కొంతవరకు నివారించవచ్చని భద్రతా నిపుణులు సూచిస్తున్నారు.

# ఆకివీడు ఘటనపై ఉప ముఖ్యమంత్రి ఆగ్రహం

అమరావతి, మార్చి 27 మన గళం : పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో శ్రీరామనవమి సందర్భంగా జరిగిన దాడి ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రామాలయంలో పూజలో పాల్గొనేందుకు వెళ్లిన గౌరవ శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజుపై, ఆయన అనుచరులు, జనసేన నాయకులపై ఆయుధాలతో దాడి జరగడం తీవ్రంగా ఖండించారు.


పవిత్రమైన శ్రీరామనవమి రోజున ఆలయం వద్ద ఈ ఘటన చోటుచేసుకోవడం వెనుక కుట్ర కోణం ఉన్నట్లు అనిపిస్తోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పండుగ రోజు ఇలాంటి ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమని ఆయన అభిప్రాయపడ్డారు. శాంతి భద్రతలను భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, దాడి వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని పోలీసు శాఖను ఆదేశించారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితులు ఎవరైనా సరే వారిని వదిలిపెట్టకూడదని సూచించారు.

దాడిలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పండుగల సమయంలో భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేయాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఆలయాల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ప్రశాంతంగా పండుగలు జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొత్తంగా ఈ ఘటనను అత్యంత సీరియస్‌గా తీసుకుని, శాంతి భద్రతలను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో చట్టం, శాంతి భద్రతలు కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

### శ్రీరామ నవమి నాడు ప్రత్యేక పూజలో పాల్గొన్న బీజేపీ నాయకులు



మన గళండోన్ : ప్రజలు సుఖశాంతులతో ఉండాలని బిజెపి నాయకులు జిల్లా కోశాధికారి రాజ్ పుత్ కమలేష్ అన్నారు.పట్టణం వైయస్సార్ నగర్ లో ఉన్న రాములవారి విగ్రహాలను శాస్త్రీయంగా శుభ్రపరచి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.దేశం అభివృద్ధి చెందాలని దేశంలో సంక్షోభం లేకుండా శ్రీరాముడు ప్రజల ను ఆశీర్వదించాలని కోరారు .ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి గణేష్, ముదిరాజు, లక్ష్మీనారాయణ, సుంకి రెడ్డి,ఆర్మీ రామయ్య మరియు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# నర్సుల వలసలను అడ్డుకోవాలి: శబరి



మన గలం కర్నూలు: దేశంలో నర్సుల వలసలపై ఎంపీ బైరెడ్డి శబరి లోక్సభలో ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా 2 లక్షల మంది నర్సులుగా శిక్షణ పొందుతున్నప్పటికీ, మెరుగైన అవకాశాల కోసం ఎక్కువ మంది విదేశాలకు వెళ్తున్నారని, దీనివల్ల భవిష్యత్తులో దేశంలో తీవ్ర కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు. దీనిపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ.. నర్సులకు మెరుగైన శిక్షణ, ప్రోత్సాహకాలు అందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. అయితే, ప్రజాస్వామ్య దేశంలో వ్యక్తులు తమ కెరీర్ కోసం విదేశాలకు వెళ్లే స్వేచ్ఛ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నర్సింగ్ రంగాన్ని బలోపేతం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా వివరించారు.

# పర్ల గ్రామంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు





మన గలం కల్లూరు కల్లూరు మండల పరిధిలోని పర్ల గ్రామంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి కొండప్ప దేవాలయంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ వేడుకలను జరుపుకున్నారు సీతా సమేత రామచంద్రుడికి భక్తితో పూజలు చేసి భక్తులు తరించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప్పర సంఘం అధ్యక్షులు రామగిడ్డయ్య పర్ల గ్రామస్తులు పాల్గొన్నారు వారితో పాటు కొండప్ప దేవాలయం కమిటీ సభ్యులు కొమ్ము నాగన్న పిట్టల నాగ గోవిందు గలపారి వెంకటేశ్వర్లు ఒలగంటి బుడ్డన్న గుంటూరు నాగేశ్వరరావు తిరుపాలు వీరప్ప హుస్సేన్ మరియు పర్ల గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# ఆధార్, పాన్‌పై కేంద్రం కొత్త రూల్స్..



న్యూఢిల్లీ, మార్చి 27 ,మన గళం : దేశ ప్రజల సున్నితమైన డేటా భద్రతను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కొత్త క్లౌడ్ ఫ్రేమ్‌వర్క్‌ను అమల్లోకి తీసుకువస్తూ, ఆధార్, పాన్ వంటి ముఖ్యమైన డేటా నిల్వపై కఠిన నిబంధనలు విధించింది. ఇకపై ఆధార్, పాన్ కార్డు, యూపీఐ, పాస్‌పోర్ట్ వంటి సున్నితమైన ప్రభుత్వ డేటాను పబ్లిక్ క్లౌడ్ సర్వర్లలో నిల్వ చేయడానికి అనుమతి ఉండదు. ఈ డేటాను తప్పనిసరిగా ప్రభుత్వ ఆధీనంలోని క్లౌడ్ మౌలిక సదుపాయాల్లోనే హోస్ట్ చేయాలని కొత్త నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. డేటా లీకులు, హ్యాకింగ్ వంటి ప్రమాదాలను నివారించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. విదేశీ దాడులు, సైబర్ ముప్పులను దృష్టిలో ఉంచుకుని, ఇకపై కమర్షియల్ క్లౌడ్ సర్వీసులపై ఆధారపడకుండా, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న సురక్షిత సర్వర్లను మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ కొత్త విధానంలో భాగంగా డేటాను రెండు విభాగాలుగా విభజించారు. 'కేటగిరీ–ఏ'లో జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత సున్నితమైన డేటా, కీలక అప్లికేషన్లు ఉంటాయి. వీటిపై కఠిన నియంత్రణలు అమలవుతాయి. ఈ డేటాను కేవలం ప్రభుత్వ మద్దతు ఉన్న సర్వర్లలో మాత్రమే నిల్వ చేయాలి. ఇక 'కేటగిరీ–బీ'లో ప్రజలకు సంబంధించిన సాధారణ సేవలు, సంక్షేమ పథకాల సమాచారం వంటి తక్కువ సున్నితమైన డేటా ఉంటుంది. ఈ విభాగంలో మాత్రం పరిమితంగా ప్రైవేట్ క్లౌడ్ సేవలను వినియోగించే అవకాశం ఉంటుంది. ఈ మార్పులతో దేశంలోని డిజిటల్ డేటా భద్రత మరింత బలపడుతుందని, ప్రజల వ్యక్తిగత సమాచారం రక్షితంగా ఉంటుందని కేంద్రం విశ్వాసం వ్యక్తం చేసింది.

# గ్రామాలలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముని కళ్యాణం...





నందవరం మార్చి 27 మనగళం న్యూస్ : నందవరం మండల పరిధిలోనే వివిధ గ్రామాలలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం ఊరు ఊరు వాడ వాడ గ్రామాలలో అంగరంగ వైభవంగా శ్రీ శ్రీ సీతారాముల కళ్యాణం జరుపుకోవడం జరిగింది ముందుగా శ్రీరామునికి అభిషేకాలు ఆట పూజలు కుంకుమార్చనలు పాలాభిషేకం చేయడం జరిగింది శుద్ధ నవమి పునర్వసు నక్షత్రంలో శ్రీరాముడు జన్మించాడు. ఆ పర్వదినాన్ని శ్రీరామనవమిగా చేసుకుంటారు. ఈ సందర్భంగా ఊరూవాడా సీతారాముల కల్యాణం జరుపుతారు. నిజానికి సీతారామ కల్యాణం ఉత్తర ఫల్గుణి నక్షత్ర యుక్త వైశాఖ శుద్ధ దశమి నాడు జరిగింది. కానీ, 'మహతాం జన్మనక్షత్రే వివాహం' అంటుంది ఆగమశాస్త్రం.మహాత్ములు, అవతారమూర్తుల జన్మతిథి నాడు ఆ నక్షత్రంలో కల్యాణం చేయాలని శాస్త్ర వచనం. చైత్ర శుద్ధ నవమి పునర్వసు నక్షత్రంలో శ్రీరాముడు జన్మించాడు. ఆ పర్వదినాన్ని శ్రీరామనవమిగా చేసుకుంటారు. ఈ సందర్భంగా ఊరూవాడా సీతారాముల కల్యాణం జరుపుతారు.

# ఇండక్షన్ స్టౌవ్ వాడుతున్నారా? ఇలా చేస్తే కరెంట్ బిల్లు భారీగా తగ్గుతుంది!

హైదరాబాద్, మార్చి 27 ,మన గళం : గ్యాస్ సిలిండర్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో చాలా మంది ఇప్పుడు ఇండక్షన్ స్టౌవ్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ఇండక్షన్ వాడితే కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుందనే భయం చాలా మందిలో ఉంది. కానీ కొన్ని సులభమైన చిట్కాలు పాటిస్తే విద్యుత్‌ను ఆదా చేయడమే కాకుండా వంటను మరింత సులభంగా చేసుకోవచ్చు.

ఇండక్షన్ స్టౌవ్ ఉపయోగంలో ముఖ్యమైన విషయం పాత్రల ఎంపిక. ఎప్పుడూ ఫ్లాట్ బాటమ్ ఉన్న, ఇండక్షన్‌కు అనుకూలమైన పాత్రలనే వాడాలి. వంకరగా లేదా పలుచగా ఉన్న పాత్రలు వేడిని సరిగ్గా గ్రహించకపోవడంతో ఎక్కువ కరెంట్ ఖర్చవుతుంది. మందపాటి అడుగు భాగం ఉన్న పాత్రలు త్వరగా వేడి అయ్యి వంట సమయాన్ని తగ్గిస్తాయి. ఇంకా పవర్ సెట్టింగ్స్‌ను సరిగ్గా ఉపయోగించడం చాలా అవసరం. ప్రతి వంటకానికి వేర్వేరు మోడ్‌లు ఉంటాయి. పాలు కాగబెట్టడానికి 'మిల్క్' మోడ్, కూరలు వేయించేటప్పుడు మొదట హై పవర్, తర్వాత లో పవర్ వాడితే కరెంట్ వృథా తగ్గుతుంది.

వంట చేసేటప్పుడు పాత్రపై మూత పెట్టడం కూడా మంచి అలవాటు. ఇలా చేస్తే ఆవిరి లోపలే ఉండి ఆహారం త్వరగా ఉడుకుతుంది. ఫలితంగా సమయం తగ్గి విద్యుత్ ఆదా అవుతుంది.

ఇంకో స్మార్ట్ ట్రిక్ ఏమిటంటే, వంట పూర్తవ్వడానికి రెండు నిమిషాల ముందు స్టౌవ్ ఆఫ్ చేయడం. ఎందుకంటే ఇండక్షన్ ప్లేట్‌లో మిగిలే వేడి కొంతసేపు ఉంటుంది. ఆ వేడితోనే వంట పూర్తవుతుంది. ఇది చిన్న చిట్కా అయినా మంచి సేవింగ్ ఇస్తుంది.

అలాగే స్టౌవ్ ఆన్ చేసే ముందు వంటకు కావాల్సిన పదార్థాలన్నీ సిద్ధం చేసుకోవాలి. మధ్యలో కూరగాయలు కోయడం, పదార్థాలు వెతకడం వల్ల సమయం వృథా అవుతుంది. దీని వల్ల కరెంట్ వినియోగం పెరుగుతుంది.

చివరిగా, పాత్ర అడుగు భాగం పూర్తిగా పొడిగా ఉందో లేదో చూసుకోవాలి. తడి ఉంటే వేడి సరైన విధంగా ప్రసరించదు. అంతేకాకుండా స్టౌవ్ కూడా దెబ్బతినే అవకాశం ఉంది.



ఈ చిన్న చిన్న చిట్కాలను పాటిస్తే ఇండక్షన్ స్టౌవ్ వాడకం మీకు ఖర్చు తగ్గించేలా, సౌకర్యవంతంగా మారుతుంది. గ్యాస్‌పై ఆధారపడకుండా స్మార్ట్‌గా వంట చేసుకోవచ్చు.


# కోడుమూరు పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం

**- విష్ణుమూర్తి ఏడవ అవతారమైన శ్రీరాముని జన్మదినాన్ని, అలాగే సీతారాముల కళ్యాణాన్ని సూచిస్తుంది. సత్యం, ధర్మం, ఆదర్శవంతమైన జీవనానికి ప్రతీక**

మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణంలో శ్రీ రాముల వారి దేవాలయంలో సీతారాముల కళ్యాణం మహోత్సవము గ్రామ ప్రజలు మరియు ఎస్ఎస్ కె సమాజ్ బంధువుల ఆధ్వర్యంలో అంగ రంగ వైభవంగా నిర్వహించారు శ్రీ సీతారాముల కల్యాణానికి మంగళసూత్రాన్ని సాక్రే ఈరన్న వారి కుమారులు భగవంతుని సమర్పించారు కళ్యాణానికి జీతూరి మాధవ్ స్వామి మరియు వారి కుమారులు పట్టు వస్త్రాలను అందించారు ఈ శ్రీరాముడు పండుగను ఎంతో గొప్పగా జరుపుకుంటారు శ్రీరామ నవమి చైత్ర శుద్ధ నవమి నాడు జరుపుకునే అత్యంత పవిత్రమైన హిందూ పండుగ. ఇది విష్ణుమూర్తి ఏడవ అవతారమైన శ్రీరాముని జన్మదినాన్ని, అలాగే సీతారాముల కళ్యాణాన్ని సూచిస్తుంది. సత్యం, ధర్మం, మరియు ఆదర్శవంతమైన జీవనానికి ప్రతీకగా రాముని పూజిస్తారు శ్రీరాముడు పునర్వసు నక్షత్రం, కర్కాటక లగ్నంలో, చైత్ర శుద్ధ నవమి రోజున మధ్యాహ్న సమయంలో జన్మించాడు. అదే రోజున సీతారాముల కళ్యాణం జరగడం వల్ల, ఇది సీతారాముల కళ్యాణ వేడుకగా కూడా ప్రసిద్ధి చెందింది దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం రాముడు అవతరించాడని, ఈ పండుగ అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక అని నమ్ముతారు ఈ రోజున రామాయణ పారాయణం, రామ నామ స్మరణ చేయడం వల్ల మానసిక ప్రశాంతత, సకల శుభాలు, మరియు ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం ఈ రోజున భక్తిశ్రద్ధలతో సీతారామ కళ్యాణం చూడటం, పానకం, వడపప్పు నైవేద్యం సమర్పించడం విశేష పుణ్యఫలాన్ని ఇస్తుంది అలాగే ఈ శ్రీ రామ నవమి పవిత్రమైన రోజున రామనామ స్మరణతో, భక్తితో రాముని పూజించి రాముని ఆశీస్సులు పొందవచ్చు అలాగే పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసము, రావణ సంహారము తరువాత శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యలో పట్టాభిషిక్తుడైనాడు ఈ శుభ సంఘటన కూడా చైత్ర శుద్ధ నవమి నాడే జరిగినదని ప్రజల విశ్వాసము. శ్రీ సీతారాముల కళ్యాణం కూడా ఈ రోజునే జరగడం ఎంతో విశేషం ఈ శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని కోడుమూరు పట్టణంలోని శ్రీ రాముల వారి దేవాలయంలో శ్రీ సీతా సమేత శ్రీరాముల వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ వారు జరిపించారు అనంతరం వచ్చిన భక్తులందరూ శ్రీ సీతారాముల కళ్యాణాన్ని వీక్షించి వారి కృపా కటాక్షాలు పొందారు అనంతరం దేవస్థానం వారు ఏర్పాటు చేసిన







అన్నదాన కార్యక్రమం నందు కుటుంబ సమేతంగా పాల్గొని స్వీకరించారు అలాగే ఆలయ కమిటీ వారు కోడుమూరు పట్టణ పురవీధులలో సాయంత్రం శ్రీవారి ఉత్సవ విగ్రహాలను గ్రామ ప్రజల ఆధ్వర్యంలో రథముపై ఎంతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు ఈ కల్యాణోత్సవ కార్యక్రమానికి కోడుమూరు ఎస్సై డివై స్వామి కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ కే సమాజ్ సంఘ అధ్యక్షులు మీస్కిన్ రాంప్రసాద్, సెక్రెటరీ జీతూరి నాగరాజు, ఉపాధ్యక్షులు జితురు రవికుమార్, కోశాధికారి పులిమామిడి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీ కాటేగర్ గోపి హరిహర క్షేత్ర శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ చైర్మన్ ఎద్దుల మహేష్ రెడ్డి మరియు యువజన అధ్యక్షులు పులిమామిడి రవి, పులిమామిడి కళ్యాణ్ కాటేగర్ మహేష్, దమం శేఖర్, దగుడు వీరన్న, మిస్కిన్ గణేష్, మిస్కిన్ వెంకటరమణ, జిపి వీరన్న, దమాం గంగారాం మరియు శ్రీ ధర్మపురి ధర్మక్షేత్ర ఆలయ కమిటీ సభ్యులు మరియు సమస్త దేవాలయ ఆలయ కమిటీ సభ్యులు మరియు ఆర్ఎస్ఎస్ మరియు విహెచ్పి, బజరంగ్ దళ్, కార్యకర్తలు మరియు పోలీసు అధికారులు, గ్రామ అధికారులు, పత్రికా విలేకరులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## చీప్ ధరలో అదిరే ఎలక్ట్రిక్ స్కూటర్..



న్యూఢిల్లీ, మార్చి 27 ,మన గళం: ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ రోజురోజుకూ విస్తరిస్తున్న నేపథ్యంలో, తక్కువ ధరలో మంచి ఫీచర్లతో కొత్త స్కూటర్‌ను వినియోగదారుల ముందుకు తీసుకొచ్చింది జాలియో ఇ-మొబిలిటీ. తాజాగా విడుదల చేసిన ఎక్స్-మెన్+ 2026 మోడల్ బడ్జెట్ ధరలో మంచి రేంజ్, ఫీచర్లతో ఆకట్టుకుంటోంది. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ ధరను సుమారు రూ.60,000గా నిర్ణయించారు. నలుపు, తెలుపు, నీలం, బూడిద వంటి ఆకర్షణీయ రంగుల్లో ఇది అందుబాటులో ఉంది. డిజైన్ పరంగా చిన్న మార్పులు చేయడంతో పాటు, వెనుక చక్రాన్ని పెద్దదిగా మార్చి రైడింగ్ కంఫర్ట్‌ను మెరుగుపరిచారు. ఒక్కసారి పూర్తి ఛార్జ్ చేస్తే ఈ స్కూటర్ 120 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. గరిష్ట వేగం గంటకు 25 కి.మీ మాత్రమే ఉండటంతో ఇది లో-స్పీడ్ కేటగిరీలోకి వస్తుంది. అందువల్ల దీనిని నడపడానికి డ్రైవింగ్ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ఇందులో 60/72ఎ దీూణజ హబ్ మోటార్ ఉంది. వినియోగదారులు లిథియం లేదా లెడ్-యాసిడ్ బ్యాటరీలను తమ అవసరానికి అనుగుణంగా ఎంచుకోవచ్చు. లిథియం బ్యాటరీ 4-5 గంటల్లో ఛార్జ్ అవుతుండగా, లెడ్-యాసిడ్ బ్యాటరీకి 8-10 గంటల సమయం పడుతుంది.

భద్రత, టెక్నాలజీ విషయంలో కూడా ఈ స్కూటర్ మంచి ఫీచర్లను అందిస్తోంది. ముందు డిస్క్ బ్రేక్, వెనుక డ్రమ్ బ్రేక్ సిస్టమ్‌తో పాటు రివర్స్ గేర్, డిజిటల్ డిస్‌ప్లే, యాంటీ-థెఫ్ట్ అలారం, ఖూదీ ఛార్జింగ్ పోర్ట్, సెంట్రల్ లాకింగ్ వంటి స్మార్ట్ ఫీచర్లు ఉన్నాయి. సుమారు 80 కిలోల బరువున్న ఈ స్కూటర్ 180 కిలోల వరకు లోడ్ మోయగలదు.

స్కూటర్‌పై 2 సంవత్సరాల వారంటీ, బ్యాటరీపై 1 సంవత్సరపు వారంటీ ఇవ్వడం వినియోగదారులకు అదనపు ప్రయోజనంగా మారింది. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో 350కు పైగా షోరూమ్‌లతో విస్తరించిన ఈ సంస్థ, ఇప్పటికే లక్షలాది మంది కస్టమర్ల నమ్మకాన్ని సంపాదించింది. తక్కువ ధరలో ఎక్కువ రేంజ్ కోరుకునే వారికి ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ మంచి ఎంపికగా నిలుస్తోంది.

## ఏప్రిల్ 1 నుంచి కీలక మార్పులు...




న్యూఢిల్లీ, మార్చి 27 ,మన గళం: కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడానికి కేవలం కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో, ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా పలు కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు ఆదాయపు పన్ను నుంచి బ్యాంకింగ్, ఇంధన ధరలు, రైల్వే నిబంధనలు వరకు విస్తరించి, సామాన్యుడి దైనందిన జీవితంపై నేరుగా ప్రభావం చూపనున్నాయి. ముఖ్యంగా ఆదాయపు పన్ను విధానంలో పెద్ద సంస్కరణలు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటివరకు అమల్లో ఉన్న పాత చట్టానికి బదులుగా కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025 అమల్లోకి రానుంది. ఇందులో పన్ను చెల్లింపుదారులకు అర్థమయ్యేలా 'అసెస్మెంట్ ఇయర్', 'ప్రీవియస్ ఇయర్' వంటి క్లిష్ట పదాలకు బదులుగా 'పన్ను సంవత్సరం' అనే సులభ పదాన్ని ఉపయోగించనున్నారు. అలాగే సెక్షన్ 87ఏ కింద రిబేట్ పెరగడంతో వార్షికంగా రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి పన్ను భారం లేకుండా ఊరట లభించనుంది. ఫారం-16, 16ఏలకు బదులుగా ఫారం-130, 131లను ప్రవేశపెట్టనుండటం కూడా మరో కీలక మార్పు. ఇకపై పాన్ కార్డు కోసం ఆధార్‌ను పుట్టిన తేదీ రుజువుగా అంగీకరించకపోవడం గమనార్హం. ఇంధన రంగంలో కూడా మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ చమురు ధరలు పెరుగుతుండటంతో ఎల్‌పీజీ, సీఎన్‌జీ, పీఎన్‌జీ, ఏటీఎఫ్ ధరలు పెరగొచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. దీని ప్రభావం రవాణా ఖర్చులు, విమాన టికెట్లపై పడే అవకాశం ఉంది. రైల్వే ప్రయాణికులకు కొంత ఊరటనిచ్చే విధంగా నిబంధనల్లో మార్పులు చేశారు. ఇప్పటివరకు రైలు బయల్దేరే ముందు 4 గంటల వరకు మాత్రమే టికెట్ రద్దు చేసుకునే అవకాశం ఉండగా, ఇకపై ఈ గడువు 8 గంటలకు పెంచారు. అలాగే 8 నుంచి 24 గంటల మధ్య టికెట్ రద్దు చేస్తే 50 శాతం రిఫండ్ పొందే అవకాశం కల్పించారు. బ్యాంకింగ్ రంగంలో కూడా పలు మార్పులు అమల్లోకి రానున్నాయి. కొన్ని బ్యాంకులు ఉచిత ఏటీఎం లావాదేవీల పరిమితులను సవరించగా, అదనపు లావాదేవీలపై చార్జీలను పెంచాయి. ముఖ్యంగా యూపీఐ ద్వారా ఏటీఎం విత్‌డ్రాయల్స్‌ను కూడా ఉచిత లావాదేవీలలో భాగంగా పరిగణించనున్నారు. అలాగే కొందరు బ్యాంకులు రోజువారీ నగదు ఉపసంహరణ పరిమితులను మార్చడం గమనించాల్సిన అంశం. మొత్తంగా చూసుకుంటే, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈ మార్పులు సామాన్యుల ఖర్చులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కొన్నింటి ద్వారా ఊరట లభించనుండగా, మరికొన్నింటి వల్ల అదనపు భారం పడే పరిస్థితి కనిపిస్తోంది.

## భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు




ముంబై, మార్చి 27 ,మన గళం: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. రెండు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడుతూ కీలక సూచీలు ఒక్కసారిగా కుప్పకూలాయి. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు పెట్టుబడిదారుల సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,690.25 పాయింట్లు పడిపోయి 73,583.22 వద్ద ముగిసింది. అదే సమయంలో నిఫ్టీ 486.85 పాయింట్లు క్షీణించి 22,819.60 వద్ద స్థిరపడింది. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్టుబడిదారులు భారీగా అమ్మకాలకు దిగడం వల్ల ఈ పతనం నమోదైంది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యధికంగా 4.55 శాతం నష్టపోయింది. అలాగే బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కూడా గణనీయంగా పతనమయ్యాయి. అయితే టీసీఎస్, భారతి ఎయిర్‌టెల్, పవర్ గ్రిడ్ షేర్లు లాభాల్లో ముగియడం కొంత ఊరటనిచ్చింది. రంగాల వారీగా చూస్తే ఐటీ మినహా అన్ని సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ముఖ్యంగా పీఎస్‌యూ బ్యాంకులు, రియాల్టీ, ఆటో రంగాల్లో అమ్మకాల ఒత్తిడి అధికంగా కనిపించింది. బ్రాడర్ మార్కెట్లలో కూడా ఇదే ధోరణి కొనసాగింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా గణనీయంగా పడిపోయాయి. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు అనిశ్చితంగా ఉన్న నేపథ్యంలో, సూచీలు పెరిగినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. నిఫ్టీ 23,500 స్థాయికి చేరినప్పుడు అమ్మకాల ఒత్తిడి రావచ్చని, ఒకవేళ 22,800 స్థాయిని కోల్పోతే మార్కెట్ మరింత బలహీనపడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సంపాదకీయం

## నవకల్పనల భారతం

భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ పర్యావరణ వ్యవస్థగా అవతరించింది. కేవలం ఐటి రంగానికే పరిమితం కాకుండా వ్యవసాయం, విద్య, వైద్యం మరియు అంతరిక్ష పరిశోధనల వరకు ఈ నవకల్పనలు విస్తరించడం విశేషం. గత దశాబ్ద కాలంలో యువత ఆలోచనా ధోరణిలో స్పష్టమైన మార్పు వచ్చింది. ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థాయి నుండి, పదిమందికి ఉద్యోగాలిచ్చే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఆకాంక్ష బలపడింది. ఈ పరిణామం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారుతూ, కొత్త తరహా పని సంస్కృతికి నాంది పలికింది. యువతలో పెరుగుతున్న ఈ ఉత్సాహం దేశ పారిశ్రామిక రంగాన్ని నూతన ఉత్తేజంతో ముందుకు నడిపిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఈ స్టార్టప్ విప్లవానికి ప్రధాన ఇంధనంగా పనిచేస్తున్నాయి. 'స్టార్టప్ ఇండియా' వంటి పథకాల ద్వారా పన్ను మినహాయింపులు, సులభతరమైన మేధో సంపత్తి హక్కుల నమోదు మరియు నిధుల సమీకరణలో వెసులుబాట్లు కల్పిస్తున్నారు. ముఖ్యంగా చిన్న పట్టణాల్లో ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఇంక్యుబేషన్ కేంద్రాల ఏర్పాటు ఎంతో ఊతమిస్తోంది. నిధుల కొరత లేకుండా ముద్రా రుణాల వంటి పథకాలు చిన్న తరహా పరిశ్రమలకు అండగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ తోడ్పాటుతో యువత తమ వినూత్న ఆలోచనలను వాణిజ్య నమూనాలుగా మలచడంలో విజయం సాధిస్తున్నారు. ఈ విధానపరమైన మద్దతు వల్ల అట్టడుగు స్థాయి నుండి కూడా నూతన ఆవిష్కరణలు వెలుగులోకి వస్తున్నాయి.

అయితే, ఈ ప్రయాణంలో సవాళ్లు కూడా తక్కువేమీ లేవు. ప్రారంభించిన అన్ని స్టార్టప్‌లు విజయవంతం కాకపోవడానికి ప్రధాన కారణం మార్కెట్ అవసరాలపై సరైన అవగాహన లేకపోవడమే. కేవలం సాంకేతికతపైనే దృష్టి పెట్టకుండా, క్షేత్రస్థాయి సమస్యలకు పరిష్కారాలను వెతకడంపై యువత దృష్టి సారించాలి. పెట్టుబడుల సేకరణలో ఎదురయ్యే అడ్డంకులు మరియు ప్రభుత్వ నిబంధనల్లోని సంక్లిష్టతలను మరింత సరళతరం చేయాల్సిన అవసరం ఉంది. వైఫల్యాలను చూసి కుంగిపోకుండా, వాటి నుండి పాఠాలు నేర్చుకునే దృఢ నిశ్చయం వ్యవస్థాపకులకు ఉండాలి. మార్కెట్ ఒడిదుడుకులను తట్టుకుని నిలబడగలిగే పటిష్టమైన ప్రణాళికలు రూపొందించుకోవాలి. నైపుణ్యాభివృద్ధి అనేది స్టార్టప్ విజయానికి కీలకమైన అంశం. విద్యాసంస్థలు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో సృజనాత్మకతను మరియు విశ్లేషణాత్మక ఆలోచనలను పెంపొందించాలి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళికలు ఉండటం వల్ల యువత త్వరగా స్టార్టప్ ప్రపంచంలోకి అడుగుపెట్టగలరు. మెంటార్‌షిప్ కార్యక్రమాల ద్వారా అనుభవజ్ఞులైన పారిశ్రామికవేత్తల సలహాలను కొత్తవారికి అందించడం వల్ల పొరపాట్లను తగ్గించవచ్చు. విజ్ఞానాన్ని ఉపాధిగా మార్చే ప్రక్రియలో విద్యార్థి దశ నుండే పునాదులు పడాలి. సమాజ హితాన్ని కోరే ఆవిష్కరణల దిశగా యువతను ప్రోత్సహించడం నేటి అవసరం.

సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా స్టార్టప్ సందడి మొదలైంది. వ్యవసాయ రంగంలో వస్తున్న యాంత్రీకీకరణ మరియు సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి. విత్తనాల ఎంపిక నుండి పంట విక్రయాల వరకు ప్రతి దశలోనూ యువ పారిశ్రామికవేత్తలు కొత్త పరిష్కారాలను చూపుతున్నారు. ఇది కేవలం వ్యాపారమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యగా మారుతోంది. పల్లెటూరి ప్రతిభకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని నిరూపితమవుతోంది. స్థానిక సమస్యలకు స్థానిక పరిష్కారాలే ఉత్తమమని పలు స్టార్టప్‌లు చాటి చెబుతున్నాయి. డిజిటల్ పేమెంట్స్ మరియు ఈ-కామర్స్ రంగాలు స్టార్టప్‌లకు సరికొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి. నగదు రహిత లావాదేవీలు పెరగడం వల్ల చిన్న వ్యాపారులు కూడా తమ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా విక్రయించగలుగుతున్నారు. లాజిస్టిక్స్ రంగంలో వస్తున్న మార్పులు వస్తువుల రవాణాను సులభతరం చేశాయి. దీనివల్ల వినియోగదారులకు నాణ్యమైన సేవలు తక్కువ ధరకే అందుబాటులోకి వస్తున్నాయి. స్టార్టప్‌లు సృష్టించే పోటీ వల్ల పాత తరం వ్యాపార సంస్థలు కూడా తమ సేవలను మెరుగుపరుచుకోవాల్సి వస్తోంది. ఈ ఆరోగ్యకరమైన పోటీ అంతిమంగా వినియోగదారుడికే ప్రయోజనం చేకూరుస్తుంది.

మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య కూడా ఈ రంగంలో గణనీయంగా పెరుగుతోంది. గతంలో వ్యాపారం అంటే కేవలం పురుషులకే పరిమితం అనే భావన ఉండేది, కానీ నేడు మహిళలు తమ మేధస్సుతో అగ్రగామి స్టార్టప్‌లను నడిపిస్తున్నారు. సామాజిక అడ్డంకులను అధిగమిస్తూ మహిళలు సాధిస్తున్న విజయాలు ఇతరులకు స్ఫూర్తినిస్తున్నాయి. మహిళా స్టార్టప్‌ల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులు మరియు సబ్సిడీలు వారిని మరింత ప్రోత్సహిస్తున్నాయి. కుటుంబ బాధ్యతలతో పాటు వ్యాపార సామ్రాజ్యాలను నిర్మించడంలో వారు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఇది దేశంలో లింగ సమానత్వాన్ని పెంపొందించడానికి కూడా తోడ్పడుతోంది. పెట్టుబడిదారుల దృక్పథంలో కూడా పెను మార్పులు సంభవిస్తున్నాయి. ఒకప్పుడు రియల్ ఎస్టేట్ లేదా బంగారంపై పెట్టుబడి పెట్టడానికి మొగ్గు చూపేవారు, ఇప్పుడు స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారు. ఏంజిల్ ఇన్వెస్టర్లు మరియు వెంచర్ క్యాపిటలిస్టులు కొత్త ఆలోచనలను ప్రోత్సహిస్తూ నిధులను అందిస్తున్నారు. ఇది దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. భారతీయ స్టార్టప్‌లు అంతర్జాతీయ స్థాయి గుర్తింపును పొందుతుండటం గర్వకారణం. సరైన సమయంలో పెట్టుబడి అందితే చిన్న ఆలోచన కూడా ఒక పెద్ద కంపెనీగా ఎదగగలదని రుజువవుతోంది.

పర్యావరణ హితమైన స్టార్టప్‌లకు నేడు మంచి ఆదరణ లభిస్తోంది. కాలుష్య నియంత్రణ, పునరుత్పాదక ఇంధన వనరులు మరియు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలపై పనిచేసే సంస్థలు ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ మరియు బ్యాటరీ టెక్నాలజీలో వస్తున్న ఆవిష్కరణలు భవిష్యత్తు రవాణా వ్యవస్థను మార్చబోతున్నాయి. స్థిరమైన అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని పనిచేసే స్టార్టప్‌లకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. పర్యావరణాన్ని కాపాడుతూనే లాభాలను ఆర్జించడం సాధ్యమేనని ఈ సంస్థలు నిరూపిస్తున్నాయి. ఇది రాబోయే తరాలకు మనం అందించే గొప్ప కానుకగా మిగిలిపోతుంది. స్టార్టప్ సంస్కృతి అనేది కేవలం ఒక వ్యాపార ధోరణి మాత్రమే కాదు, అది దేశ భవిష్యత్తును నిర్ణయించే ఒక సామాజిక మార్పు. డిజిటల్ విప్లవం మరియు ఇంటర్నెట్ సౌలభ్యం వల్ల మారుమూల ప్రాంతాల వారు కూడా అంతర్జాతీయ మార్కెట్‌ను చేరుకోగలుగుతున్నారు. ప్రభుత్వం, బ్యాంకింగ్ రంగం మరియు విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేస్తే, భారత్ 'స్టార్టప్ హబ్'గా ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తుంది. స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడం వల్ల నిరుద్యోగ సమస్య పరిష్కారం కావడమే కాకుండా, నవ భారత నిర్మాణానికి బలమైన పునాది పడుతుంది. ఈ క్రమంలో ప్రతి ఆవిష్కరణ దేశ ప్రగతికి ఒక మెట్టుగా మారుతుంది.

# రియల్‌మీ 16 5జీ వచ్చేస్తోంది..




న్యూఢిల్లీ, మార్చి 27 మన గళం : స్మార్ట్‌ఫోన్ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రియల్‌మీ 16 5జీ త్వరలో భారత మార్కెట్లోకి రానుంది. ఇప్పటికే వియత్నాం వంటి దేశాల్లో మంచి స్పందన పొందిన ఈ ఫోన్, ఏప్రిల్ 2న ఇండియాలో అధికారికంగా విడుదల కానుంది. ఈ ఫోన్‌లో ప్రత్యేకంగా అందరినీ ఆకట్టుకుంటున్న ఫీచర్ 'సెల్ఫీ మిర్రర్'. ఫోన్ వెనుక భాగంలో అమర్చిన ఈ చిన్న అద్దం ద్వారా యూజర్లు రియర్ కెమెరాతోనే హైక్వాలిటీ సెల్ఫీలు తీసుకోవచ్చు. ఫోటోగ్రఫీ ప్రియులకు ఇది ఒక కొత్త అనుభూతి ఇవ్వనుంది. ఫీచర్ల విషయానికి వస్తే, ఈ ఫోన్‌లో 50 మెగాపిక్సెల్ ప్రైమరీ కెమెరా ఉండగా, ఇందులో సోనీ సెన్సార్‌ను ఉపయోగించారు. కెమెరా క్వాలిటీ విషయంలో ఇది మంచి పనితీరును అందించనుందని కంపెనీ చెబుతోంది. అత్యంత ఆకర్షణీయమైన అంశం 7000ఎంఏహెచ్ భారీ బ్యాటరీ. సాధారణ వినియోగంలో ఇది రెండు రోజుల వరకు బ్యాకప్ ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. అంతేకాకుండా 60వా ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్ ఉండటం వల్ల తక్కువ సమయంలోనే బ్యాటరీ పూర్తి ఛార్జ్ అవుతుంది. సాఫ్ట్‌వేర్ పరంగా ఈ ఫోన్ ఆండ్రాయిడ్ 16 ఆధారిత రియల్‌మీ యూఐ 7.0 పై పనిచేస్తుంది. డిజైన్ పరంగా 'ఎయిర్ బ్లాక్', 'ఎయిర్ వైట్' వంటి స్టైలిష్ కలర్స్‌లో అందుబాటులోకి రానుంది. మొత్తానికి భారీ బ్యాటరీ, కొత్త సెల్ఫీ ఫీచర్, శక్తివంతమైన కెమెరాతో రియల్‌మీ 16 5జీ మార్కెట్లో మంచి పోటీ ఇవ్వనుందని టెక్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మెటాకు భారీ షాక్.. కుప్పకూలిన షేర్లు!




న్యూయార్క్, మార్చి 27 మన గళం : అమెరికా కోర్టుల తాజా తీర్పులు సోషల్ మీడియా దిగ్గజం మెటాకు గట్టి దెబ్బతీశాయి. యువ వినియోగదారులకు హాని కలిగించినందుకు సంస్థను బాధ్యురాలిగా పేర్కొంటూ వెలువడిన రెండు కీలక తీర్పుల ప్రభావంతో, గురువారం మెటా షేర్లు దాదాపు 7 శాతం వరకు పతనమయ్యాయి.

న్యూ మెక్సికో, లాస్ ఏంజిల్స్ ప్రాంతాల్లో జరిగిన విచారణల్లో ఈ తీర్పులు వెలువడినట్లు సమాచారం. జరిమానాలు వందల మిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నప్పటికీ, దీని కంటే పెద్ద ప్రభావం కంపెనీ వ్యాపార విధానాలపై పడే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా యూజర్-జెనరేటెడ్ కంటెంట్‌కు సంబంధించిన ఫెడరల్ రక్షణ చట్టాలను పక్కనపెట్టి ఇచ్చిన ఈ తీర్పులు, భవిష్యత్తులో మరిన్ని కేసులకు దారి తీసే అవకాశముంది.

సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల డిజైన్ విధానాలే వినియోగదారులకు హాని కలిగిస్తున్నాయనే ఆరోపణలు మరింత బలపడుతున్నాయి. దీని వల్ల మెటా తన ప్రకటనల ఆధారిత వ్యాపార మోడల్‌లో మార్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ పరిణామాలు టెక్ రంగంపైనా ప్రభావం చూపించాయి. ఆల్ఫాబెట్ షేర్లు కూడా సుమారు 2.8 శాతం తగ్గగా, స్నాప్ షేర్లు 12 శాతం కంటే ఎక్కువగా కుప్పకూలాయి. పెట్టుబడిదారులు ఇప్పుడు చట్టపరమైన, నియంత్రణ సంబంధిత రిస్క్‌లను మళ్లీ అంచనా వేస్తున్నారు.

ఇక మెటా ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్న సమయంలో, ఈ తీర్పులు సంస్థపై అదనపు ఒత్తిడిని తీసుకొచ్చాయి. అయితే ఈ తీర్పులపై అప్పీల్‌కు వెళ్లాలని మెటా, ఇతర టెక్ కంపెనీలు నిర్ణయించినట్లు సమాచారం. దీంతో ఈ న్యాయపోరాటం మరింత కాలం కొనసాగే అవకాశముంది.

# వేసవి వేడి.. ఏసీలకు భారీ డిమాండ్, ధరలు పెరుగుదల!



హైదరాబాద్, మార్చి 27 మన గళం : ఈ ఏడాది వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎయిర్ కండీషనర్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో ఏసీ కొనుగోలు చేయాలనుకునే వారికి షాకింగ్ న్యూస్ ఎదురవుతోంది. మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం, ఏసీల ధరలు 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. ఎండలు మండిపోవడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఏసీల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. డిమాండ్ ఒక్కసారిగా పెరగడం వల్ల కంపెనీలు కూడా ధరలను పెంచే దిశగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా కొత్త నిబంధనలు, ముడి సరుకు ధరల పెరుగుదల ఈ నిర్ణయానికి కారణమవుతున్నాయి. ఏసీ ధరలు పెరగడానికి ప్రధాన కారణం బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ప్రవేశపెట్టిన కొత్త నిబంధనల అమలే. ఈ నిబంధనల ప్రకారం తయారీ ప్రక్రియలో మార్పులు చేయాల్సి రావడంతో కంపెనీల వ్యయం పెరిగింది. అదనంగా, అంతర్జాతీయ మార్కెట్‌లో కాపర్, అల్యూమినియం వంటి లోహాల ధరలు పెరగడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గడం కూడా ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే ప్రముఖ ఏసీ బ్రాండ్లు ధరల పెంపుపై సంకేతాలు ఇచ్చాయి. పెరిగిన తయారీ ఖర్చులను వినియోగదారులపై మోపాల్సి వస్తుందని కంపెనీలు భావిస్తున్నాయి. దీంతో మధ్యతరగతి ప్రజలకు ఏసీ కొనుగోలు మరింత భారంగా మారే అవకాశం ఉంది. వేసవి వేడి తీవ్రత దృష్ట్యా ఏసీల విక్రయాలు పెరిగినా, పెరిగిన ధరల వల్ల సామాన్యుల బడ్జెట్‌పై ఒత్తిడి పెరుగుతుందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. మొత్తానికి, ఈ సీజన్‌లో ఏసీ కొనుగోలు చేయాలంటే ముందుగానే ప్లాన్ చేసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

# స్వల్పంగా పెరిగిన పసిడి ధర..



హైదరాబాద్, మార్చి 27 మన గళం : అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావంతో దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. నేడు బంగారం ధర స్వల్పంగా పెరగగా, వెండి ధర మాత్రం గణనీయంగా తగ్గడం గమనార్హం. ఈ రోజు ఉదయం మార్కెట్ పరిస్థితుల ప్రకారం, హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ. 160 పెరిగి రూ. 1,44,710కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా పెరిగి రూ. 1,32,650 వద్ద కొనసాగుతోంది. అయితే వెండి ధరలో భారీ మార్పు కనిపించింది. కిలో వెండి ధర ఏకంగా రూ. 15,000 వరకు పడిపోయి రూ. 2.45 లక్షలకు చేరింది. ఇది ఇటీవల కాలంలో గమనించదగ్గ పతనంగా భావిస్తున్నారు. ఇతర ప్రధాన నగరాల్లో ధరలు పరిశీలిస్తే, చెన్నైలో 24 క్యారెట్ల బంగారం రూ. 1,46,510గా ఉండగా, న్యూఢిల్లీలో రూ. 1,44,860గా ఉంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ. 1,44,710 వద్ద కొనసాగుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర చెన్నైలో రూ. 1,34,300గా, న్యూఢిల్లీలో రూ. 1,32,800గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ధరలు స్థిరంగా లేవు. ప్రస్తుతం ఔన్స్ బంగారం ధర సుమారు 4,444 డాలర్ల వద్ద, వెండి ధర 69 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, డాలర్ బలం, గ్లోబల్ మార్కెట్ పరిస్థితులు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. అదే సమయంలో వెండి డిమాండ్ తగ్గడం వల్ల ధరలు పడిపోయినట్లు భావిస్తున్నారు.

# చింతపండుతో చర్మ సంరక్షణ

- సహజ కాంతికి సులభ చిట్కాలు
- మొటిమలు, మచ్చలకు సహజ పరిష్కారం
- ఫేస్ ప్యాక్స్‌తో మెరుగైన చర్మ కాంతి
- ప్యాచ్ టెస్ట్ తప్పనిసరి



డెస్క్, మార్చి 27 మన గళం, ఆరోగ్యం : వంటకాలకు పుల్లపుల్లటి రుచిని అందించే చింతపండు, చర్మ సంరక్షణలో కూడా కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మొటిమలు, మచ్చలు తగ్గించడం నుంచి ముఖ కాంతిని పెంచడం వరకు అనేక సౌందర్య ప్రయోజనాలు దీనిలో ఉన్నాయి. ఇంట్లోనే సులభంగా తయారుచేసుకునే కొన్ని ఫేస్ ప్యాక్స్ ద్వారా చర్మాన్ని సహజంగా సంరక్షించుకోవచ్చని సూచిస్తున్నారు. మొటిమల సమస్యతో బాధపడుతున్నవారికి చింతపండు ఫేస్ ప్యాక్ మంచి పరిష్కారంగా ఉపయోగపడుతుంది. చింతపండును వేడి నీటిలో నానబెట్టి గుజ్జు తీసుకుని, అందులో ముల్తానీ మట్టి, రోజ్ వాటర్ కలిపి ముఖానికి అప్లై చేయాలి. కొంతసేపు ఆరిన తర్వాత చల్లటి నీటితో కడిగితే చర్మంపై ఉన్న జిడ్డు, ధూళి తొలగి మొటిమలు తగ్గుముఖం పడతాయి. చర్మ కాంతిని పెంచుకోవాలంటే చింతపండు గుజ్జుకు కొద్దిగా పసుపు కలిపి ఫేస్ ప్యాక్‌గా ఉపయోగించవచ్చు. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని 20 నిమిషాల తర్వాత కడిగితే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. పసుపులోని గుణాలు చర్మాన్ని శుభ్రపరచి సహజ కాంతిని ఇస్తాయి. బ్లీచింగ్ ప్రభావం కోసం చింతపండు గుజ్జుకు శనగపిండి, అరటిపండు గుజ్జు కలిపి పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. దీన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగితే చర్మం క్లీన్‌గా, కాంతివంతంగా కనిపిస్తుంది. ఇది సహజ బ్లీచ్‌లా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

స్క్రబ్‌గా వాడాలంటే చింతపండు గుజ్జుకు నిమ్మరసం, బేకింగ్ సోడా, పంచదార కలిపి మృదువుగా మసాజ్ చేయాలి. ఇది చర్మంపై ఉన్న మృత కణాలను తొలగించి జిడ్డు తగ్గిస్తుంది. ముఖ్యంగా ఆయిల్ స్కిన్ ఉన్నవారికి ఇది మంచి ప్రయోజనం ఇస్తుంది. టోనర్‌గా ఉపయోగించాలంటే చింతపండు రసానికి టీ డికాక్షన్ కలిపి కాటన్‌తో ముఖానికి రాయాలి. కొంతసేపటి తర్వాత కడిగితే చర్మం తాజాగా మారుతుంది. ఇది సహజ టోనర్‌లా పనిచేస్తుంది. అయితే చింతపండును నేరుగా చర్మానికి రాయడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇతర పదార్థాలతో కలిపి వాడాలి. అలాగే కొందరికి అలర్జీ వచ్చే అవకాశం ఉండటంతో ముందుగా ప్యాచ్ టెస్ట్ చేయడం తప్పనిసరి. అవసరమైతే నిపుణుల సలహా తీసుకుని ఉపయోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని సూచిస్తున్నారు.



# క్యాన్సర్ ప్రమాదం తగ్గించాలంటే.. ఈ ఆహారాలు తప్పనిసరి



డెస్క్, మార్చి 27 మన గళం, ఆరోగ్యం : ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా యువతలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి, ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం, వ్యాయామం లేకపోవడం వంటి కారణాల వల్ల క్యాన్సర్ ప్రమాదం పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. అయితే రోజువారీ ఆహారంలో కొన్ని పోషక పదార్థాలను చేర్చడం ద్వారా ఈ ప్రమాదాన్ని కొంతవరకు తగ్గించవచ్చని సూచిస్తున్నారు. పర్పుల్ స్వీట్ పొటాటో వంటి ఊదా రంగు గడ్డలు యాంటీ ఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. వీటిలో ఉండే ఆంథోసయనిన్స్ శరీరంలో వాపును తగ్గించి కణాలను రక్షిస్తాయి. పరిశోధనల ప్రకారం ఇవి పెద్ద పేగు క్యాన్సర్ కణాల పెరుగుదలను తగ్గించే సామర్థ్యం కలిగి ఉంటాయి. బ్రోకలి స్ప్రౌట్స్, మైక్రోగ్రీన్స్ కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో సల్ఫోరాఫేన్ అనే శక్తివంతమైన సమ్మేళనం అధికంగా ఉండి శరీరంలోని డిటాక్స్ వ్యవస్థను చురుకుగా చేస్తుంది. సాధారణ బ్రోకలీతో పోలిస్తే వీటిలో పోషకాలు అనేక రెట్లు ఎక్కువగా ఉంటాయి. కివీ పండ్లు విటమిన్ సి, ఫైబర్, పాలీఫినాల్స్‌తో నిండి ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ స్థాయిలను పెంచి డీఎన్ఏ రక్షణలో సహాయపడతాయి. అలాగే జీర్ణక్రియను మెరుగుపరచి మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. గ్రీన్ టీని రోజువారీ అలవాటులో భాగం చేసుకోవడం కూడా మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఇందులో ఉండే సమ్మేళనాలు ట్యూమర్ పెరుగుదలను అణచే విధంగా పనిచేస్తాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. గ్రీన్ టీ తాగే వారిలో క్యాన్సర్ ప్రమాదం తక్కువగా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. బీన్స్‌ను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన ఫైబర్ లభిస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థను మెరుగుపరచి కొలొరెక్టల్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రోజుకు అవసరమైన ఫైబర్‌లో పెద్ద భాగాన్ని బీన్స్ ద్వారా పొందవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే క్యాన్సర్ నివారణకు ఒక్క ఆహారం సరిపోదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. సమతుల్య ఆహారం, వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ, సరైన నిద్ర వంటి అంశాలు కూడా సమానంగా ముఖ్యమని చెబుతున్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా మాత్రమే క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు



# జుట్టు తెల్లబడటం తగ్గించాలా?.. ఇంట్లోనే సహజ చిట్కాలు

డెస్క్, మార్చి 27 మన గళం, ఆరోగ్యం : ప్రస్తుతం చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ బాధిస్తున్న సమస్యల్లో జుట్టు తెల్లబడటం ప్రధానంగా మారింది. జీవనశైలి మార్పులు, పోషకాహార లోపం, కాలుష్యం, ఒత్తిడి వంటి కారణాల వల్ల ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అయితే ఇంట్లో సులభంగా లభించే కొన్ని పదార్థాలతో ఈ సమస్యను కొంతవరకు నియంత్రించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఉసిరికాయలు జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఉసిరి రసం తాగడం వల్ల జుట్టు తెల్లబడడం తగ్గడమే కాకుండా జుట్టు రాలడం, చివర్లు చిట్లడం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. ఇందులో ఉన్న పోషకాలు జుట్టు పెరుగుదలను ప్రోత్సహించి, కేశాలను బలంగా ఉంచుతాయి.

ఉసిరికాయలను నీటిలో నానబెట్టి, అందులో నీలగిరి తైలం కలిపి రాత్రంతా ఉంచాలి. మరుసటి రోజు అందులో నిమ్మరసం, పెరుగు, గుడ్డు కలిపి తలకు ప్యాక్‌లా అప్లై చేయాలి. 1520 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేస్తే మంచి ఫలితం కనిపిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. కరివేపాకును మెత్తగా చేసి అందులో పెరుగు కలిపి జుట్టుకు పట్టిస్తే కేశాలు బలపడతాయి. ఈ మిశ్రమాన్ని కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి కొంతసేపు ఉంచి తలస్నానం చేస్తే జుట్టు నల్లగా, ఆరోగ్యంగా మారుతుంది. ఇది పూర్వకాలం నుంచి ఉపయోగిస్తున్న సహజ పద్ధతి.

జామ ఆకులను మెత్తగా చేసి తలకు పట్టించడం ద్వారా కూడా జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే కొబ్బరినూనెలో నిమ్మరసం కలిపి మర్దన చేయడం వల్ల కేశాలకు పోషణ అందుతుంది. స్కాల్ప్ ఆరోగ్యంగా ఉండి జుట్టు నెమ్మదిగా నల్లబడే అవకాశాలు పెరుగుతాయి. ఇవేకాక ఆముదం, వేపనూనె, ఉసిరిపొడి, బాదం నూనె, శీకాకాయ వంటి పదార్థాలు కూడా జుట్టు సంరక్షణలో కీలకంగా పనిచేస్తాయి. ఇవి కేశాలను బలంగా ఉంచి, తెల్లబడే వేగాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అయితే ఈ చిట్కాలు సహజమైనవే అయినప్పటికీ ప్రతి ఒక్కరికి ఒకే విధంగా పనిచేయవు. కాబట్టి ముందుగా పరీక్షించి ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అవసరమైతే వైద్యుల సలహా తీసుకోవడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు.



# తగ్గిపోతున్న సహనం.. పెరుగుతున్న ఆవేశం

- చిన్న విషయాలకు పెద్ద గొడవలు
- డిజిటల్ జీవనశైలి ప్రభావం స్పష్టంగా
- కోప నియంత్రణకు నిపుణుల సూచనలు



డెస్క్, మార్చి 27 మన గళం, ఆరోగ్యం : సమాజంలో సహనం తగ్గిపోతూ, ఆవేశం పెరుగుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. చిన్న విషయాలకు పెద్ద గొడవలు, క్షణిక కోపంతో జరిగే దారుణాలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. కుటుంబాల్లోనే తీవ్రమైన ఘర్షణలు చోటుచేసుకోవడం, క్షణిక ఆవేశంతో అపరాధాలకు పాల్పడటం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. నిపుణుల ప్రకారం, ఆధునిక జీవనశైలి ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా మారింది. ఒక క్లిక్‌తో ఆహారం, ఒక టచ్‌తో సమాచారం, ఒక స్క్రోల్‌తో వినోదం అందుబాటులోకి రావడంతో మనిషి వెంటనే ఫలితాలను ఆశించే అలవాటు పెరిగింది. ఏ చిన్న ఆలస్యమైనా అసహనానికి దారితీస్తోంది. ఓపిక అనేది అవసరం లేని ఆలస్యమనే భావన బలపడుతోంది. కార్యాలయ ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, కుటుంబ బాధ్యతలు, భవిష్యత్తుపై అనిశ్చితి, ఫోన్ నోటిఫికేషన్లుఈ అన్ని అంశాలు కలిపి మనసును ఎప్పుడూ ఒత్తిడిలో ఉంచుతున్నాయి. ఫలితంగా చిన్న విషయాలకే పెద్ద కోపం బయటపడుతోంది. మనసుకు విశ్రాంతి లేకపోవడం కూడా అసహనాన్ని పెంచుతోందని నిపుణులు చెబుతున్నారు. సోషల్ మీడియాలో కనిపించే ఇతరుల విజయాలు, సంతోషాలు కూడా మనలో పోలికలను పెంచుతున్నాయి. దీంతో అసంతృప్తి, అసహనం పెరుగుతుంది. అలాగే వినే అలవాటు తగ్గిపోవడం వల్ల పరస్పర అవగాహన తగ్గి, గొడవలు పెరుగుతున్నాయి. ఎదుటివారి మాట పూర్తిగా వినకుండానే స్పందించడం సమస్యలను మరింత తీవ్రమయ్యేలా చేస్తోంది. సహనం తగ్గితే సంబంధాలు దెబ్బతింటాయి. కుటుంబం, స్నేహాలు, బంధుత్వాలు దూరమవుతాయి. తొందరపాటు నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఏర్పడి, జీవితంపై చిరాకు పెరుగుతుంది. దీర్ఘకాలంలో ఇది మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.



కోపాన్ని నియంత్రించుకోవడం సాధ్యమేనని నిపుణులు సూచిస్తున్నారు. కోపం వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా కనీసం ఐదు సెకన్లు ఆగడం, లోతుగా శ్వాస తీసుకోవడం ఉపయోగపడుతుంది. నాలుగు సెకన్లు లోపలికి, నాలుగు సెకన్లు ఆపి, నాలుగు సెకన్లు బయటకు వదిలే శ్వాస వ్యాయామం మనసును ప్రశాంతంగా ఉంచుతుంది. రోజూ కొద్దిసేపు ధ్యానం, ప్రాణాయామం చేయడం వల్ల మనసుకు శాంతి లభిస్తుంది. సరైన నిద్ర, సమతుల్య ఆహారం, శారీరక విశ్రాంతి కూడా సహనాన్ని పెంచుతాయి. ప్రతి ఒక్కరూ మనలాగే ఉండరని అర్థం చేసుకోవడం, ప్రతి విషయం అంత ముఖ్యమా అని ఆలోచించడం ద్వారా కోపాన్ని తగ్గించుకోవచ్చు. సహనం అంటే కేవలం ఎదురుచూడడం కాదు.. పరిస్థితిని అర్థం చేసుకునే శక్తి, మనసును నియంత్రించుకునే సామర్థ్యం. ఈ గుణాన్ని పెంపొందించుకుంటేనే వ్యక్తిగత జీవితం, కుటుంబ సంబంధాలు, సమాజం ఆరోగ్యంగా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక


# తిరిగి తెలుగులో సినిమాలకు రెడీ అయిన కృతి శెట్టి



హైదరాబాద్, మార్చి 27 మన గళం, సినిమా: దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యువ నటి కృతి శెట్టి మళ్లీ టాలీవుడ్‌పై దృష్టి సారించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు వరుస హిట్‌లతో టాలీవుడ్‌లో సెన్సేషన్‌గా నిలిచిన ఈ ముద్దుగుమ్మ, మధ్యలో తమిళ చిత్రాలపై ఎక్కువ ఫోకస్ పెట్టింది. అయితే ఇప్పుడు మళ్లీ తెలుగులో బిజీ అవ్వడానికి సిద్ధమవుతోందని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2003 సెప్టెంబర్ 21న కర్ణాటకలోని మంగళూరులో జన్మించిన కృతి, ముంబైలో పెరిగింది. చిన్నతనం నుంచే ప్రకటనల ద్వారా కెరీర్ ప్రారంభించిన ఆమె, అనేక ప్రముఖ బ్రాండ్‌ల అడ్స్‌లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం 2019లో వచ్చిన సూపర్ 30 చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసి, తరువాత హీరోయిన్‌గా ఎదిగింది. తమిళ స్టార్ హీరో కార్తీ సరసన నటించిన 'వాతియార్' వంటి ప్రాజెక్టులతో తమిళంలో మంచి గుర్తింపు పొందిన కృతి, ఇప్పుడు మళ్లీ తెలుగు సినిమాల్లో అవకాశాలు అందుకుంటోందని సమాచారం. అలాగే మరో తమిళ స్టార్ జయం రవితో కూడా ఓ ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. ఇక టాలీవుడ్ విషయానికి వస్తే, ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న భారీ మల్టీస్టారర్ సినిమాలో కృతి శెట్టి హీరోయిన్‌గా నటించే అవకాశాలు ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో వెంకటేష్, కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటించనున్నారని సమాచారం. అలాగే మరో హీరోయిన్‌గా కీర్తి సురేష్ పేరు కూడా వినిపిస్తోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే కృతి, తరచూ తన గ్లామరస్ ఫోటోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. టాలీవుడ్‌లో మరోసారి అవకాశాలు దక్కించుకోవడంతో, ఆమె కెరీర్ మళ్లీ ఊపందుకునే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి, కృతి శెట్టి రీఎంట్రీతో టాలీవుడ్‌లో పోటీ మరింత పెరగడం ఖాయం.

## 'పెద్ది' టీజర్ హంగామా

హైదరాబాద్, మార్చి 27 ,మన గళం, సినిమా: పెద్ది చిత్రానికి సంబంధించిన తాజా టీజర్ మెగా అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ పూర్తిగా భిన్నమైన మాస్ అవతార్‌లో కనిపించారు. మొదటి టీజర్‌లో క్రికెట్ ఆటగాడిగా కనిపించిన ఆయన, ఈసారి కుస్తీ పోటీల్లో పాల్గొనే శక్తివంతమైన యోధుడిగా దర్శనమిచ్చారు. భారీ శరీరాకృతి, రఫ్ లుక్, కఠినమైన భావోద్వేగాలతో ఆయన పాత్రకు మరింత బలం చేకూరింది. ఈ టీజర్ ద్వారా సినిమా నేపథ్యంపై కొంత క్లారిటీ వచ్చింది. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో కథ సాగుతూ, స్థానిక క్రీడలు ముఖ్యంగా కుస్తీ పోటీలు కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. రామ్ చరణ్ చేసిన శరీర మార్పు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇక ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, ఆమె పాత్ర కూడా కథలో ప్రత్యేకంగా ఉండబోతుందని సమాచారం. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం పలు విభాగాల్లో కొత్త ప్రమాణాలు సృష్టించే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం టీజర్‌తోనే భారీ బజ్ సృష్టించిన పెద్ది చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. టీజర్‌లో కనిపించిన మాస్ అవతార్‌తో రామ్ చరణ్ అభిమానులను అలరించగా, సినిమా విడుదలపై అంచనాలు మరింత పెరిగాయి.




## నెమ్మదించిన 'డ్రాగన్' షూటింగ్




హైదరాబాద్, మార్చి 27 ,మన గళం, సినిమా: డ్రాగన్ చిత్ర షూటింగ్ నెమ్మదిగా సాగుతుండటంతో అభిమానుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే షూటింగ్ ప్రారంభమై చాలా కాలం గడిచినా ఇప్పటివరకు కేవలం 40 శాతం మాత్రమే పూర్తయిందని సమాచారం. దీంతో సినిమా విడుదల మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ నీల్ సినిమాలు సాధారణంగా భారీ యాక్షన్ సన్నివేశాలు, గ్రాండ్ విజువల్స్‌తో తెరకెక్కుతాయి. ప్రతి సన్నివేశాన్ని అత్యంత నాణ్యతతో తెరకెక్కించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల షూటింగ్ వేగం తగ్గినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎన్టీఆర్ పాత్రకు సంబంధించిన కీలక సన్నివేశాలను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుండగా, ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండనుంది. ఎన్టీఆర్‌ను ఇంతవరకు చూడని కొత్త అవతార్‌లో చూపించేందుకు దర్శకుడు ప్రత్యేకంగా కృషి చేస్తున్నాడు. డ్రాగన్ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, మైత్రి మూవీ మేకర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఆలస్యమైనా, మంచి క్వాలిటీతో బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుందనే నమ్మకంతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.

## శబ్దాల వెనుక దాగి ఉన్న రహస్యం..




హైదరాబాద్, మార్చి 27 మన గళం, సినిమా: టాలీవుడ్‌లో వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రియదర్శి ప్రధాన పాత్రలో తెరకెక్కిన సుయోధన చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రజ్వలా లైన్ క్రియేషన్స్ బ్యానర్‌పై వైఎస్ మాధవ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్, శ్రీరామ నవమి సందర్భంగా విడుదలై ఆసక్తిని రేకెత్తిస్తోంది.

కథ:

ఈ చిత్రంలో వరుణ్ (ప్రియదర్శి) 'ఫోలే' ఆర్టిస్ట్‌గా పనిచేస్తుంటాడు. సినిమాల్లో వినిపించే వివిధ శబ్దాలను సృష్టించడం అతని వృత్తి. అయితే చిన్నప్పటి నుంచి అతనికి 'సుయోధన' అనే ఒక వింత శబ్దం వినిపిస్తూ, కళ్లముందు దుర్యోధనుడి రూపం కనిపిస్తూ భయపెడుతుంటుంది. అతని తండ్రి మద్దులూరి ప్రకాష్ పాత్రలో సాయి కుమార్ నటించారు. గొప్ప నాటక కళాకారుడైన ఆయన, కొడుకి భయాన్ని తగ్గించడానికి దుర్యోధన పాత్రలు వేయడం కూడా మానేసి రాజకీయాల్లోకి వెళ్తాడు.

ఇలాంటి పరిస్థితుల్లో వరుణ్ జీవితంలోకి హీరోయిన్ సమిత (ద్రిషిక చందర్) రావడంతో కథ కొత్త మలుపు తిరుగుతుంది. తనకు వినిపించే శబ్దం, కనిపించే రూపం వెనుక ఏదో పెద్ద రహస్యం ఉందని, అది తన ప్రాణాలకు ముప్పుగా మారుతుందని వరుణ్ గ్రహిస్తాడు. తండ్రిపై జరిగిన దాడి, రాజకీయ కోణాలు, 'సుయోధన' అసలు ఎవరు అనే మిస్టరీ చుట్టూ కథ ఆసక్తికరంగా సాగుతుంది.

విశ్లేషణ:

తెలుగు సినిమాల్లో ఇప్పటివరకు పెద్దగా చూడని 'ఫోలే ఆర్టిస్ట్' కాన్సెప్ట్‌ను దర్శకుడు కొత్తగా ప్రెజెంట్ చేశారు. శబ్దాల సృష్టి, వాటి వెనుక ఉన్న ప్రక్రియను థ్రిల్లింగ్‌గా చూపించడం సినిమా ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

నటీనటుల ప్రతిభ:

ప్రియదర్శి తన నటనతో మరోసారి మెప్పించాడు. ముఖ్యంగా ఎమోషనల్ సీన్స్, భయానికి గురయ్యే సన్నివేశాల్లో అతని యాక్టింగ్ హైలైట్‌గా నిలుస్తుంది. ఇక 'డైలాగ్ కింగ్' సాయి కుమార్ తన గంభీర స్వరం, దుర్యోధనుడి గెటప్‌లో అద్భుతంగా మెరిసి సినిమాకు బలం చేకూర్చారు. సీనియర్ నటి ప్రేమ తల్లి పాత్రలో ఒదిగిపోయారు.

సాంకేతికంగా: థ్రిల్లర్ సినిమాకు ప్రాణం అయిన సౌండ్ డిజైన్ ఈ చిత్రంలో అత్యద్భుతంగా ఉంది. జై క్రిష్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకుడిని కథలోకి తీసుకెళ్తుంది. అలాగే సత్యదేవ్, బిత్తిరి సత్తి పాత్రలు కథలో కీలకంగా మారాయి.

చివరిగా: కేవలం మిస్టరీ కాకుండా, మదర్ సెంటిమెంట్, పొలిటికల్ డ్రామా కలగలిపి దర్శకుడు కథను ఆసక్తికరంగా మలిచాడు. రొటీన్ కథలకు భిన్నంగా, సైకలాజికల్ థ్రిల్లర్‌ను ఇష్టపడే ప్రేక్షకులకు 'సుయోధన' మంచి ఎంపికగా నిలుస్తుంది. కొత్త కాన్సెప్ట్, బలమైన నటన, టెక్నికల్ వాల్యూస్ కలిసొచ్చిన ఈ చిత్రం థ్రిల్లర్ ప్రియులకు ఖచ్చితంగా నచ్చే అవకాశం ఉంది.

# టీమిండియాలోకి వైభవ్ సూర్యవంశీ..

## పరుగుల వరదకు నాంది?



హైదరాబాద్, మార్చి 27 మన గళం : భారత క్రికెట్‌లో కొత్త సంచలనం సృష్టిస్తున్న యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ పేరు ప్రస్తుతం దేశవ్యాప్తంగా మారుమోగుతోంది. కేవలం 14 ఏళ్ల 23 రోజుల వయసులోనే ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున అరంగేట్రం చేసి రికార్డులు సృష్టించిన ఈ బాల ప్రతిభ, తన తొలి మ్యాచ్‌లోనే శార్దూల్ ఠాకూర్ వేసిన మొదటి బంతిని సిక్సర్‌గా మలచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అంతటితో ఆగకుండా, మూడో మ్యాచ్‌లోనే గుజరాత్ టైటాన్స్పై కేవలం 35 బంతుల్లో సెంచరీ సాధించి, యూసుఫ్ పఠాన్ పేరిట ఉన్న ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును బద్దలు కొట్టాడు. ఈ ప్రదర్శనతోనే అతడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారిపోయాడు. ఐపీఎల్‌కే పరిమితం కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ తన ప్రతిభను చాటుకున్న వైభవ్, అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లాండ్‌పై 80 బంతుల్లో 175 పరుగులు చేసి భారత్‌కు విజయం అందించాడు. అతని ఇన్నింగ్స్‌లో 15 సిక్సర్లు, 15 ఫోర్లు ఉండటం అతని దూకుడు బ్యాటింగ్‌కు నిదర్శనం. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పర్యటనల్లోనూ అతని ఆట స్థిరంగా ఉండటం విశేషం. అంతర్జాతీయ క్రికెట్ మండలి నిబంధనల ప్రకారం 15 ఏళ్లు పూర్తి అయితేనే అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడే అర్హత లభిస్తుంది. మార్చి 27, 2026తో 15వ ఏట అడుగుపెట్టిన వైభవ్, ఇప్పుడు అధికారికంగా టీమిండియా సీనియర్ జట్టులోకి ఎంపికయ్యే అర్హతను సాధించాడు. గతంలో పాకిస్థాన్‌కు చెందిన హసన్ రజా చిన్న వయసులో టెస్ట్ ఆడిన రికార్డు ఉంది. ఇప్పుడు అదే దారిలో వైభవ్ ముందుకు సాగుతున్నాడు. త్వరలోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలతో కలిసి ఆడే అవకాశం ఈ యువ ఆటగాడికి లభించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐపీఎల్‌లో బిజీగా ఉన్న వైభవ్, మార్చి 30న చెన్నై సూపర్ కింగ్స్తో జరిగే మ్యాచ్‌లో మరోసారి తన ప్రతిభను చాటుకునేందుకు సిద్ధమవుతున్నాడు. ఇక భవిష్యత్తుపై చూస్తే, 2027 వన్డే ప్రపంచకప్ దృష్ట్యా సెలెక్టర్లు అతనిపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయి. అతని ప్రస్తుత ఫామ్, ఆత్మవిశ్వాసం చూస్తుంటే, భారత క్రికెట్‌కు మరో సూపర్ స్టార్ సిద్ధమవుతున్నాడని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి, చిన్న వయసులోనే భారీ రికార్డులు బద్దలు కొడుతూ ముందుకు దూసుకెళ్తున్న వైభవ్ సూర్యవంశీ పేరు భవిష్యత్తులో మరింత గర్జించనుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

# రోహిత్‌ను గుర్తుపట్టలేకపోయిన నీతా అంబానీ..!



ముంబై, మార్చి 27 మన గళం : ఐపీఎల్ 2026 సీజన్‌కు సిద్ధమవుతున్న టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తన కొత్త లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. తాజాగా ముంబై ఇండియన్స్ ప్రాక్టీస్ సెషన్‌లో జరిగిన ఓ సంఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముంబై ఇండియన్స్ అధినేత్రి నీతా అంబానీ, రోహిత్‌ను చూసి కాసేపు గుర్తుపట్టలేకపోయారు. అతని ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్ చూసి ఆశ్చర్యపోయిన ఆమె, "అసలు నిన్ను గుర్తుపట్టలేకపోయాను.. కుర్రాడిలా మారిపోయావు" అంటూ ప్రశంసించారు. ఈ మాటలకు రోహిత్ సిగ్గుపడుతూ నవ్వేయడం అక్కడి వారికి ఆకట్టుకుంది. 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకున్న రోహిత్, తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించాడు. కఠినమైన డైట్, వర్కవుట్‌లతో దాదాపు 10 కిలోల బరువు తగ్గి అల్ట్రా స్లిమ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. అతని ఈ మార్పు అభిమానులను కూడా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇక అదే ప్రాక్టీస్ సెషన్‌లో మరో సరదా సంఘటన కూడా చోటుచేసుకుంది. నీతా అంబానీ తన మనవళ్లతో కలిసి మైదానానికి రాగా, బౌలింగ్ కోచ్ కీరన్ పొలార్డ్ను చూపిస్తూ "పొలి కాక" అని పిలవడంతో అక్కడ నవ్వులు పూశాయి. తనను 'కాక' అని పిలవడంతో పొలార్డ్ కూడా కాసేపు ఆశ్చర్యపోయాడు. ఈ మొత్తం వీడియోను ముంబై ఇండియన్స్ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అది ఇప్పుడు వైరల్‌గా మారింది. రోహిత్ కొత్త లుక్, నీతా అంబానీ రియాక్షన్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

# బ్యాడ్మింటన్‌కు గుడ్‌బై చెప్పిన కరోలినా మారిన్..!



హెలువా, మార్చి 27 మన గళం : బ్యాడ్మింటన్ ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న స్పెయిన్ దిగ్గజ క్రీడాకారిణి కరోలినా మారిన్ అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పింది. పదేపదే వేధిస్తున్న మోకాలి గాయాల కారణంగా ఆమె ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. చాలాకాలంగా కుడి, ఎడమ మోకాళ్ల గాయాలతో బాధపడుతున్న మారిన్, ఇటీవల గాయం తీవ్రత పెరగడంతో ఇకపై కొనసాగడం సాధ్యం కాదని భావించింది. యూరోపియన్ ఛాంపియన్‌షిప్‌లో ఆడాలని ఆశించినా, శరీరం సహకరించకపోవడంతో చివరికి రిటైర్మెంట్ ప్రకటించింది. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో భావోద్వేగంగా స్పందించిన మారిన్, "నా ప్రొఫెషనల్ బ్యాడ్మింటన్ ప్రయాణం ఇక్కడితో ముగిసింది. మరోసారి కోర్టులో పోటీ పడాలని ఎంతో ఆశపడ్డాను, కానీ గాయం ఆ అవకాశాన్ని దూరం చేసింది" అని తెలిపింది. తన కెరీర్‌లో మారిన్ ఎన్నో గొప్ప విజయాలు సాధించింది. 2016 రియో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం గెలవడం ఆమె కెరీర్‌లో అత్యంత ముఖ్య ఘట్టం. అలాగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో మూడు స్వర్ణ పతకాలు సాధించి తన ప్రతిభను చాటుకుంది. భారత స్టార్ పి.వి. సింధుతో జరిగిన మ్యాచ్‌లు అభిమానులకు చిరస్మరణీయంగా నిలిచాయి. గాయాలు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగిన మారిన్, తన అగ్రెసివ్ ఆటతీరుతో బ్యాడ్మింటన్ ప్రపంచంలో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఆమె రిటైర్మెంట్‌తో క్రీడా ప్రపంచం ఒక గొప్ప చాంపియన్‌ను కోల్పోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఆర్సీబీకి మరో షాక్..

## ఫిట్‌నెస్ టెస్టులో విఫలమైన స్టార్ పేసర్..!




బెంగళూరు, మార్చి 27 మన గళం : ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే జట్లకు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్న వేళ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)కి మరో పెద్ద షాక్ తగిలింది. ఇప్పటికే ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ గాయంతో కొన్ని మ్యాచ్‌లకు దూరం కానుండగా, ఇప్పుడు మరో విదేశీ పేసర్ నువాన్ తుషార అందుబాటులో ఉండడంపై అనిశ్చితి నెలకొంది. శ్రీలంక క్రికెట్ బోర్డు నుంచి అవసరమైన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) ఇంకా రాకపోవడంతో తుషార ఐపీఎల్‌లో ఆడటం సందేహంగా మారింది. ఇటీవల శ్రీలంక బోర్డు ఫిట్‌నెస్ ప్రమాణాలను కఠినతరం చేయడంతో, వాటిని పూర్తి చేసిన ఆటగాళ్లకే విదేశీ లీగ్స్‌లో ఆడేందుకు అనుమతి ఇస్తోంది. ఈ క్రమంలో తుషార ఆ ప్రమాణాలను అందుకోలేకపోవడంతో అతడికి అనుమతి నిలిచిపోయింది. ఇప్పటికే గాయాల సమస్యలతో ఆర్సీబీ పేస్ దళం బలహీనపడగా, మరోవైపు యశ్ దయాల్పై ఫ్రాంచైజీ వేటు వేయడం జట్టుకు మరింత ఇబ్బందిగా మారింది. దీంతో బౌలింగ్ విభాగంలో లోటు స్పష్టంగా కనిపిస్తోంది. అయితే, ఇతర శ్రీలంక ఆటగాళ్లు అయిన దుష్మంత్ చమీర, దసున్ శనక, పథుమ్ నిశాంక, కమిందు మెండిస్లకు ఎన్‌ఓసీ లభించడంతో వారు ఐపీఎల్ ఆడేందుకు సిద్ధమయ్యారు. మార్చి 28న ప్రారంభమయ్యే ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్తో తలపడనుంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు పేసర్ల కొరత జట్టుపై ఎంత ప్రభావం చూపుతుందో చూడాలి. మొత్తానికి, టోర్నీ ప్రారంభానికి ముందే ఆర్సీబీకి ఎదురైన ఈ సమస్యలు అభిమానుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.ఓ

# పీఎస్‌ఎల్‌లో వింత..

# రంగు మారిన బంతి..!



లాహోర్, మార్చి 27 మన గళం : పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026 ఆరంభ మ్యాచ్‌లోనే ఓ వింత ఘటన చోటుచేసుకుంది. లాహోర్‌లోని గడ్డాఫీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తెల్లటి క్రికెట్ బంతి గులాబీ రంగులోకి మారడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. లాహోర్ ఖలందర్స్, హైదరాబాద్ కింగ్స్‌మెన్ జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో ఆట మధ్యలో ఫీల్డర్లు బంతిని తమ జెర్సీలకు రుద్దడం వల్ల ఈ సమస్య తలెత్తింది. హైదరాబాద్ కింగ్స్‌మెన్ జెర్సీలకు వాడిన నాసిరకం రంగు తెల్లటి బంతికి అంటుకోవడంతో, కొద్దిసేపటికే అది పింక్‌గా మారిపోయింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు మీమ్స్, సెటైర్లతో విరుచుకుపడ్డారు. అంతర్జాతీయ లీగ్‌లో ఇలాంటి ఘటన జరగడం పీఎస్‌ఎల్ నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తింది. ఈ విషయంపై పాకిస్థాన్ మాజీ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ వ్యంగ్యంగా స్పందిస్తూ, "జెర్సీలకు స్థానికంగా రంగు వేయించినట్టుంది" అంటూ ఎగతాళి చేశాడు. ఇక అభిమానులు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇది అంతర్జాతీయ లీగ్‌లా కనిపించట్లేదు", "గల్లీ క్రికెట్‌లా ఉంది" అంటూ కామెంట్లు చేశారు. మ్యాచ్ ప్రసార నాణ్యతపై కూడా విమర్శలు వెల్లువెత్తాయి. 4కే అని చెప్పినా, కెమెరా షేకింగ్, మసకబారిన దృశ్యాలు, ఆడియో-వీడియో సింక్ సమస్యలు కనిపించాయని ప్రేక్షకులు పేర్కొన్నారు. అయితే ఈ ట్రోలింగ్‌పై హైదరాబాద్ కింగ్స్‌మెన్ ఫ్రాంచైజీ సరదాగా స్పందిస్తూ, "పీఎస్‌ఎల్‌లో తొలి పింక్ బాల్ మ్యాచ్ గెలిచినందుకు అభినందనలు" అంటూ సెటైరికల్ పోస్టు చేసింది. మొత్తంగా బంతి రంగు మారిన ఘటన, సాంకేతిక లోపాలతో పీఎస్‌ఎల్-2026 ప్రారంభం వివాదాస్పదంగా మారింది.


Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.